క్లుప్తంగా

భవాని పీఠం వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న భవాని భక్తులు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి యాతపేటలో మంగళవారం భవాని పీఠం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పీఠం భక్తులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా అమ్మవారిని అలంకరించగా అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంటా జగదీశ్వర రావు, ఇల్లాపు వెంకటరావు, బిందేష్, రవి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ వారాల పండుగ



భక్తురాలిని ఊరేగింపుగా తీసుకు వెళుతున్న పెద్దలు

భీమునిపట్నం: నాగవంశీయులు ఆరాధ్య దైవం మరిడమ్మవారి వారాల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. చిన్నబజారు సమీపంలోని అమ్మవారి చదును పట్టునుంచి అమ్మవారిని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకు వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలను నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో నాగవంశ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, పెద్దలు మొకర నీలకంఠం, కంటుభుక్త ముత్యాలరావు, గాడు సన్యాసినాయుడు, కనకల సన్నిబాబు, రాంబుక్త ప్రభాకర్‌నాయుడు, అప్పికొండ నర్సింగరావు పాల్గొన్నారు.

కొత్తపేటలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన విద్యుత్ ఉపకరణాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు చిట్టివలస జ్యూట్‌మిల్లు రోడ్డు కొత్తపేటలో సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో బవిరిశెట్టి వేములయ్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వేములయ్యకు చెందిన ఫ్రిడ్జ్, టీవీ, రెండు ఫ్యాన్లు, విద్యుత్ మీటరు కాలిపోయాయి. ఇంట్లో మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు గమనించి అదుపు చేశారు. ఆ ప్రమాదంలో రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

జోన్-3 విద్యుత్ శాఖలో పలువురికి బదిలీ

మధురవాడ: విద్యుత్ శాఖ విశాఖ జోన్-3 కార్యాలయం పరిధిలో పలువురుకి బదిలీలయ్యాయి. కొమ్మాది ఏఈఈకి పదోన్నతి లభించింది. ఇక్కడ పనిచేస్తున్న ఏఈఈ వై. సురేష్‌కు డీఈఈగా పదోన్నతి రావడంతో సోంపేట బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గతంలో పీఎంపాలెం సెక్షన్‌లో పనిచేసి బదిలీపై వెళ్లి ప్రస్తుతం సింహాచలం ఎల్‌టీ మీటర్స్ పనిచేస్తున్న డి.నరేష్ ఇక్కడికి రానున్నారు. ఇక్కడ డీఈఈగా పనిచేసిన కిరణ్ కుమార్ బదిలీ కాగా ఆయన స్థానంలో కార్పొరేట్ ఆఫీసు పనిచేస్తున్న అనీల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. విద్యుత్ శాఖ రెవెన్యూ కార్యాలయంలో ఏఏవో పనిచేసిన పున్నాన బంగారు నాయుడు మధురవాడ జోనల్ కార్యాలయంలో ఏఏవో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కార్పొరేట్ ఆఫీసు నుంచి బదిలీ పై వచ్చిన రమాదేవి బాధ్యతలు చేపట్టారు.

ప్రజలకు 'ఆరోగ్య రక్ష'



మూలకుద్దు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు



కొత్త మూలకుద్దులో లబ్ధిదారులకు మందులు, కేస్ షీట్లు అందిస్తున్న భీమిలి ఎంపీపీ వాసురాజు

తగరపువలస: రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అందుకే ఏటా రెండు సార్లు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారని భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. మంగళవారం భీమిలి మండలం కొత్త మూలకుద్దులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడారు. గతంలో వైద్య సేవల కోసం పట్టణాల్లో వైద్యుల చుట్టూ తిరిగితే ప్రస్తుతం సాధారణ, ప్రత్యేక వైద్యులంతా గ్రామీణ ప్రాంత ప్రజల చుట్టూ తిరుతున్నారన్నారు. ఈ శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ వాసులకు కేస్ షీట్లు, మందులు పంపిణీ చేశారు. అంగన్వాడీలు ఏర్పాటు చేసిన వైఎస్సార్ పోషకాహార ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎంపీడీవో వెంకటరమణ, ఇంచార్జ్ సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు కొల్లి కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, కొయ్య అప్పలసూర్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చెల్లూరి నగేష్, సమ్మిడి శ్రీనివాసరావు, పీతల గంగ శ్రీను, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, కొల్లి రామకృష్ణ, రాజగిరి రామచంద్రరావు, మల్లేటి హరి, కొయ్య సూరి గురువులు, పంచాయితీ విస్తరణ అధికారి జి.అప్పలరాజు, భీమిలి ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

పద్మనాభం/తగరపువలస: పద్మనాభం, తగరపువలస మండలాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. కోరాడలో నిర్వహించే శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని ఎంపీడీవో ఎం. విజయ్‌కుమార్ తెలిపారు. అలాగే జీవీఎంసీ భీమిలి జోన్ బొగ్గురోడ్డు-2 వార్డు సచివాలయ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు జెడ్సీ బి.రాము తెలిపారు.

825 మందికి పరీక్షలు..

ఈ శిబిరంలో వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, ఎం.ఫణికుమార్, దుర్గా కల్యాణ, బి. రవీంద్రనాయక్, బి.కిరణ్‌కుమార్, సయ్యద్ అజ్మల్ సాహుద్దీన్, ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆధ్వర్యంలో 825 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

మామిడిలోవలో 163 మందికి పరీక్షలు

ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి షహనాజ్, నలుగురు నిపుణులైన వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారు. 616 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు. అందులో 12 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి ఉచితంగా చేయడానికి నిర్ణయించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నారని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి మహేష్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

భీమునిపట్నం: జీవీఎంసీ మూడవ వార్డు ఎగువపేట ప్రాంతంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. భారీగా తరలివచ్చిన రోగులను వైద్యులు పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. 3వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతికి చెందిన ప్రజలకు చెంతనే వైద్యం అంతుతోందన్నారు. వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుపల్లి కొండబాబు, వాసుపల్లి ఎల్లాజీరావు, డాక్టర్‌లు కల్యాణి, అఖిల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న వైద్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రవీంద్ర నాయక్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఫణికుమార్

పశు సంరక్షణతో అధిక పాల ఉత్పత్తి



పాడి రైతులకు మందులు అందజేస్తున్న అధికారులు

ఆనందపురం : పాడి పశువులను మంచి సంరక్షణ అందిస్తే అధిక పాలదిగుబడి సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.కరుణాకర్ చెప్పారు. మండలంలోని బోనిలో మంగళవారం భారత ప్రభుత్వ పశుధన్ జాగృతి అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, పశు సవర్ధక శాఖ సంయుక్తంగా ఉచిత మెగా పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం, రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ కరుణాకర్ మాట్లాడుతూ పాడి పశువులలో గర్భకోశ సంబంధమైన వ్యాధులు సంక్రమించడం వలన పశువులలో గర్భం దాల్చే శాతం బాగా తగ్గిపోతోందన్నారు. పోషకాహార లోపం వలన కూడా పశువులలో గర్భ విచ్ఛిత్తి జరిగి పిండం నశించి పోతుందన్నారు. దీని వలన పాల ఉత్పత్తిపై ప్రభావం చూపుతోందన్నారు. దీంతో పాడి పశువులలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చికిత్సలు అందించడానికి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పశు సంవర్ధక శాఖ ప్రాంతీయ పశు వ్యాధుల పరీక్షా కేంద్రం డీడీ మోహిని కుమారి మాట్లాడుతూ శిబిరంలో గుర్తించిన పాడి పశువులకు చికిత్స చేసి మందులను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా 175 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, రెండింటికీ మందగుది, రెండింటికీ హెర్నియా, మరో ఏడింటికీ చిన్న పాటి శస్త్ర చికిత్సలు చేశారు. మరి కొన్ని పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు, మినరల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోని అప్పలకొండ, వైఎస్సార్‌సీపీమండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, శ్రీ వేంకటేశ్వర పశు విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు శ్రీకళ, రవి కుమార్, డిఎల్‌డిఎ ఈవో రామ్మోహన్, ఏడీ ప్రసాద్‌రావు, భీమిలి ఏడీ వెంకట రమణ, పశు వైద్యులు హిమజ, కన్నయ్య నాయుడు, లీలారాణి, గోపాల మిత్ర బోని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి పరిధిలో కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు ఆర్‌డీఓ, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. వివిధ పార్టీల నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఇంటింటికి సిబ్బంది వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలంచడంతోపాటు అవసరమైన మేరకు సవరణలు, చేర్పులు చేశారని అన్నారు. దాని ప్రకారం ఈనెల 27న పూర్తి వివరాలతో కూడిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం అయా ప్రాంతాల్లో ఉండే అన్ని కళాశాలల్లోను ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, గంటా నూకరాజు, డీఎఎస్ రాజు, చందరరావు, అనిల్ ప్రసాద్, దీపుల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెన్నిస్‌లో ఎన్ఆర్ఐ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ఎన్ఆర్ఐ కళాశాల యాజమాన్యం

తగరపువలస: ఈ నెల ఒకటి నుంచి 15 వరకు రాజమండ్రి జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగిన డాక్టర్ వైఎస్సార్ వైద్య విద్యాలయం 23వ వార్షిక అంతర కళాశాలల మహిళ టెన్నిస్ పోటీలలో సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. వ్యక్తిగత విభాగంలో బీఎల్ఎన్ రితిక, డబుల్స్‌లో యశస్వితో కలిసి బంగారు పతకాలు సాధించి చాంపియన్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, సీఈవో శ్రీనిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కార్యాలయాధికారి శివప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ కావ్య, గున్నాజీ తదితరులు అభినందించారు.

హిందీ లోయర్ పరీక్షా ఫలితాలు విడుదల

తగరపువలస: గత నెల సెప్టెంబర్ 9,10వ తేదీల్లో జరిగిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలకు సంబంధించి లోయర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశ్కి పరీక్షలకు 99 మంది విద్యార్థులు హాజరుకాగా నూరుశాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. మరోవారం రోజుల్లో హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫలితాలు విడుదలవుతాయన్నారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



అరటిపండ్ల అలంకరణలో రాచ పోలమాంబ



రెడ్డివీధిలో అమ్మవారు



విశేష అలంకరణలో విజయదుర్గా దేవి



పూజలందుకుంటున్న అమ్మవారు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భీమిలి రోడ్డులోని మండపం వద్ద అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ నవనాగార్చన, మానసాదేవి పూజ, రాహుకేతు పూజ, గాయత్రీదేవి అర్చన చేశారు. అనంతరం వేర్వేరుగా సుబ్రహ్మణ్యస్వామి, అమ్మవార్లకు అభిషేకాలు జరిపించారు. చివరగా సర్ప బంధాలు, హోమాలు నిర్వహించారు. భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో పాత మూలకుద్దు పంచాయతీ పాకదిబ్బ వద్ద అమ్మవార్లను శాకాంబరి దేవి అలంకరించారు. దాకమర్రి పంచాయతీలో అమ్మవారి విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. ఇవి కాకుండా సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు, బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయాలలో అర్చకులు మహిళలచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయించారు.

అన్నపూర్ణ దేవిగా దుర్గామాత దర్శనం

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాలు మూడో రోజు మంగళవారం దుర్గామాత భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మధురవాడ టైలర్స్ కాలనీలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయం, చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయాల్లో అమ్మల మూల విరాట్‌లకు పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్న పూర్ణాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించి కుంకుమ పూజలకు మహిళలు విశేషంగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో భాగంగా టైలర్స్ కాలనీలో అమ్మ వారికి విశేష అలంకరణ చేశారు.

అరటిపండ్లతో రాచ పోలమాంబ అలంకరణ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస కూడలిలోని గ్రామ దేవత రాచ పోలమాంబను మంగళవారం అరటిపండ్లతో అలంకరించారు. ప్రతి వారం ప్రత్యేక అలంకరణలో భాగంగా ఈ అలంకరణ చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎల్లారమ్మకు సారె సమర్పణ

తగరపువలస: తగరపువలస, భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామదేవత ఎల్లారమ్మ మెట్టపై కొలువై ఉన్న ఎల్లారమ్మతల్లికి భక్తులు మంగళవారం సారె సమర్పించారు. తగరపువలస పురవీధులలో అమ్మవారికి కలశాలు, వందల రకాల స్వీట్లు, చీరెలు, అరటి పండ్లతో ఊరేగింపు నిర్వహించి ఆలయం వద్దకు చేరుకున్నారు.



ఎల్లారమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

అన్నపూర్ణా దేవీ అలంకరణలో బబ్బేలమ్మ

పీఎంపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కారుషెడ్ బబ్బేలమ్మ అమ్మవారు మంగళవారం అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు.



అన్నపూర్ణాదేవి అలంకరణలో బబ్బేలమ్మ



చంద్రంపాలెంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పాలిథిన్ సంచుల తనిఖీలపై ఆరోపణలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో సింగిల్ యూజ్ పాలిథిన్ సంచుల తనిఖీలలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది చేతవాటం ప్రదర్శిస్తున్నారని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. పాలిథిన్ సంచులు, డిస్పోజల్ గ్లాసులు విక్రయిస్తున్న దుకాణదారులను పట్టుకుని ఫైన్‌లు విధించి బిల్లులు ఇవ్వకుండా వెళ్లిపోతుండటంతో తరచూ ఇరువర్గాల మధ్య తగాదాలు చోటుచేసుకుంటున్నాయి. సోమవరం సంగివలస అనిట్స్ రహదారిలో పలువురు వ్యాపారుల నుంచి డిస్పోజల్ గ్లాసులు పట్టుకుని రూ.1000 నుంచి రూ.3 వేల వరకు ఫైన్‌ల పేరుతో వసూళ్లు చేశారు. బిల్లులు అడిగితే ఆన్‌లైన్‌లో వస్తాయంటూ బుకాయిస్తున్నారని వ్యాపారస్తులు ఆరోపించారు. మంగళవారం కూడా స్థానిక ప్రయివేట్ మార్కెట్ ఎదురుగా పలు కిరాణా, కూరగాయల దుకాణాల యజమానుల నుంచి ఫైన్‌లు దండిగా వసూలు చేసి బిల్లులు ఇవ్వకపోవడం తగాదాలకు దారి తీసింది. దీనిపై వార్డు సచివాలయాల శానిటేషన్ కార్యదర్శుల దృష్టికి తీసుకురాగా పాలిథిన్ సంచుల తనిఖీలలో తాము పాల్గొనడం లేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

మధురవాడ: విద్యుత్ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విశాఖ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మధురవాడలోని జోనల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పద్మనాభం మండలం అనంతవరం సమీపంలోని గొల్లపేటకు చెందిన దువ్వి విష్ణు అనే అనధికార వ్యక్తితో విద్యుత్ పనులు చేయించి ప్రమాదానికి కారణమైన పద్మనాభం సెక్షన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న రాధాకృష్ణను సస్పెండ్ చేసినట్టు చెప్పారు. బాధితుడు తీవ్రంగా గాయపడడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు.

బాధితుడికి న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న గొల్లలపాలెం గ్రామస్తులు

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన గొల్లపాలెం గ్రామానికి చెంది దువ్వ విష్ణును ఆదుకోవాలని గొల్లపాలెం గ్రామస్తులు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గ్రామస్తులు ధర్నా చేశారు. అనంతవరం లైన్ మేన్ రాధా కృష్ణ గొల్లలపాలెం గ్రామానికి చెందిన దువ్వ విష్ణును హెల్పర్‌గా పెట్టుకున్నారు. ఈ నెల 14వ తేదీన అనంతవరంలో విద్యుత్ ట్రాన్సుఫార్మర్ ఫ్యూజ్ కొట్టేసింది. లైన్‌మేన్ రాధాకృష్ణ ఎల్‌సీ తీసుకోకుండా ఎల్‌సీ తీసుకున్నానని ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వేయాలని హెల్పర్ విష్ణుకు చెప్పాడు. దీంతో విష్ణు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ఫ్యూజ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. శరీరమంతా బాగా కాలిపోయింది. దీనిపై గొల్లపాలెం గ్రామస్తులు బాధితుడు విష్ణుకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సబ్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. డీఈ వచ్చి సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అనంతవరం వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, గేదెల చంద్రరావు, రొంగలి రవి, అనంతవరం ఉపసర్పంచ్ కిలపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సినీ నటి అన్నపూర్ణ



శ్రీవారిని దర్శించుకున్న సినీ నటి అన్నపూర్ణమ్మ

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం సీనియర్ సినీ నటి అన్నపూర్ణ దర్శించుకుని అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాగరానికి అభిముఖంగా సాక్ష్యాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువై ఉండటం విశాఖ ప్రజలు చేసుకున్న పూర్వ పుణ్యఫలమన్నారు.

19 నుంచి 24వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు

పీఎంపాలెం: స్థానిక శిల్పారామం(జాతర)లో ఈ నెల 19 నుంచి 24వ తేదీవరకూ ప్రతిరోజూ ప్రత్యేక సాంస్కృతిక వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశామని స్థానిక పరిపాలన అధికారి టీ. విశ్వనాథరెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు సంప్రదాయ జానపద , కూచిపూడి నృత్యాలు సాయంత్రం 6 గంటలను నుంచి ప్రదర్శిస్తారని తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



గీతాలాపన చేస్తున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది: తిరుమల తిరుపతి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలు, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రొమ్ము క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

సీతమ్మధార : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రొమ్ము క్యాన్సర్‌ను నయం చేయవచ్చని మహాత్మాగాంధీ క్యాన్సర్ రీసెర్చ్ హాస్పటల్ అధినేత డాక్టర్ వూన మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆశీలమెట్టలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలోని అన్ని ప్రీమి యర్ ఇన్స్టిట్యూట్‌లలో నిపుణులైన అంకాలజిస్టులు అందుబాటులో ఉన్నారన్నారు. 18 ఏళ్లుగా 8,500 మంది రొమ్ము క్యాన్సర్ బాధితులకు విజయవంతంగా చికిత్సలు చేసినట్టు తెలిపారు. రొమ్ము క్యాన్స ర్ ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారిందన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స అందిస్తే న యం అవుతుందన్నారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రా ల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్యసేవలందిస్తోందన్నారు.